# రజ్జుసర్పం



రామాన్ని పోలీసులు పట్టుకుపోయారనే వార్త ఊళ్లో దావానలం లాగా వ్యాపించింది. వ్యాపించ కేం చేస్తుంది? ఇందులో అసత్యం ఏమీ లేదు; ఆశ్చర్యం అంతకన్నా లేదు. రామం సంగతి మనకి తెలియదుగాని, అతని మిత్రులు మాత్రం ఈ శుభ ముహూర్తానికి లేక దుర్ముహూర్తానికి ఎదురు చూస్తూనేఉన్నారు.

రామం కమ్యూనిష్టని చాలా మంది నమ్మకం. ఐనా, అతని హితు లెవ్వరూ తెలిసినట్టు నటించేవాళ్ళు కారు. చాటుగా 'ఏమోయ్ కమ్యూని' ష్టని పిలిచేవాళ్ళు. రామం మందహాసం చేసేవాడు, అవు నన్నట్టు! అప్పుడప్పుడు తను ముందు చెయ్యబోయే దేశసేవను గురించికూడా మాట్లాడేవాడు. ఇదీ ప్రస్తుతం రామం చరిత్ర. రామం ఇలా కమ్యూనిష్టయి చెడిపోయినందుకు అతని మిత్రులు లక్ష్మిని నిందించేవాళ్ళు. ఈ మధ్య రామం మిత్రులతో కలవడంకూడా మానేశాడు!—లక్ష్మితోనో, ఏకాంతంగానో కాలం గడుపుతూ ఉండేవాడు. ఐతే,

చక్రపాణి

ఈ అరెస్టులో ఆశ్చర్యకరమైన విషయం ఒకటి జరిగింది. రామాన్ని అరెస్టు చేసింది బాంబులు చేస్తూ ఉండగా కాదు; భావిదగ్గరికి పోతుండగా!-అతనిదగ్గర సెడిషన్ కిందకు వచ్చేదేమీ లేదు. అలాంటిది సంపాదించటానికి అతని గది సోదాకూడా చూడలేదు. మరి ఏ నేరంకింద పట్టుకున్నట్టు! వాళ్లకేం ఆధారాలు దొరికినై? ఏమో! వందలాది జీతాలు తింటున్న సి. ఐ. డీ. లే రామం రహస్యం యింత కాలం కనుక్కో లేకపోతే, మన మిప్పుడు బుర్ర బద్దలుకొట్టుకుని మాత్రం ఏం ప్రయోజనం! ఏమున్నా వెనుకటి సంగతులు తడివిచూస్తే, ప్రయోజన ముంటుందేమో! చూద్దాము.

రామం పుట్టింది పల్లెటూళ్లో (మేనమామ లింట). ఐనా, మూడో క్లాసునుంచి ఇప్పటివరకు టౌనులోనే చదువుకొస్తున్నాడు; ఉంటున్నాడు. చదువులో అతనంత చురుకూ కాదు, మందమూ కాదు. వల్లించటంలో మాత్రం తోసివేయదగ్గవాడు కాడు. మొదటినుంచీ అతనికి స్నేహితులంటూ ఎక్కువలేరు. వేషంలో వ్యవహారాల్లో పూర్వఖత్తు. పిలకని పేటెంటు చేశాడని అంటూవుండేవాళ్ళు తోటి విద్యార్థులు. గ్రాంథికవాది. అరసున్న హత్య అయినందుకూ, బండి'ఱ' బలి ఐనందుకూ, వాపోయేవాడు. యిలాంటి రామం ధర్డుయియరు; చివరకు పూర్తిగా మారిపోయాడు వేషంలోనూ, భాషలోనూ! పైగా రాజకీయాల్లోకూడా వేలు పెట్టసాగాడు. స్టూడెంట్ల కనీసపు కోర్కెలమీద ఒకటి రెండుసార్లు క్లాసులో ఉపన్యసించాడుకూడా.

ఈ మార్పు కంతా కారణం ఒక వ్యక్తి - స్త్రీలింగానికి చెందిన వ్యక్తి - పేరు లక్ష్మి. ఈడు 16-18 మధ్య; ఆమె తండ్రి స్టేషనుమాస్టరు. విశాఖపట్నంనించి బదిలీ అయి, యిక్కడికి వచ్చాడు. అతనికి శేషగిరి అనే కొడుకు ఒకడు. ధర్డుయియరు చదువుతున్నాడు. లక్ష్మి ఫస్టియరు.

లక్ష్మి యింటర్వల్ సమయాలలో అన్న క్లాసులోకి వస్తుండేది. ఆమెకు కొత్తాపాతా లేదు. విశాఖపట్నపు రాజకీయ వాసన ఆమెలో బాగా జీర్ణించిపోయింది. స్టూడెంటు ఫెడరేషనులో చేరమని అందరిని హెచ్చరిస్తూవుండేది! కమ్యూనిజమన్నా కమ్యూనిస్టులన్నా ఆమె సింపతీ కనపర్చేది.

ఇక్కడి విద్యార్థుల్లో ఇంతకుపూర్వం రాజకీయ సంచలనం ఏమీలేదు. ఈమెనుబట్టి ఒక్కొక్కరు మారడం మొదలుపెట్టారు.. కాని రామాన్ని మాత్రం ఆమె వాదన లేమీ మార్చలేక పోయినై. అసలతను పాల్గొంటేగా



"పిన్నిగారూ! కాసిని అవుపాలు ఇప్పిస్తారా? ఈ చుట్టుపక్కల్లో మరెక్కడా ఆవు యున్నట్టే లేదు!..."
"అయ్యోరాత! మాకు ఒక ఆవుకూడానా? — అదో, మీ బాబాయి అచ్చ ఆవులాగే అరుపులు అరుస్తూ పిల్లల్ని ఆడిస్తూంటారే తల్లీ!"

మారటానికి, మారక పోవటానికి ?— ఒక మూలని కూర్చునేవాడు, తనకి సంబంధ మేమీ లేనట్టు! లక్ష్మి కొంత కాలాని కతని తత్వం గ్రహించింది. అతన్ని పడిపించటానికో అన్నట్టు ఒకటి రెండు ప్రశ్నలు వేసి, సమాధానం, కాదు — అతని అభిప్రాయం చెప్పే దాకా ఊరుకునేది కాదు. మొదటి సారి తన్ను ప్రశ్నించినప్పుడు రామానికి శరీరం గగుర్పొడిచింది. సమాధానం చెప్పా లంటే నోట్లోనుంచి మాట బైటికి రాలేదు ఎట్లాగో ఆమె అభిప్రాయాలు తెలుసు కాబట్టి — ఏకీభవిస్తున్నా నన్నట్టు తెలియపరచాడు.

ఇలా అయింది వాళ్ళ పరిచయం. క్రమంగా రామం వ్యూస్ అన్నీ మారి పోయినై. శేషగిరిని అడిగి మార్క్సు రాసిన 'కేపిటల్' తీసుకున్నాడు. కొన్నాళ్ళు అందరికీ కనపడేటట్టు చేత పట్టుకునికూడా తిరిగాడు.

లక్ష్మి రామంల పరిచయం స్నేహంగా మారింది, వృద్ధిపొందింది. విద్యార్థు లది ప్రేమ అని కూడా అనుకున్నారు. విద్యార్థులదాకా ఎందుకు రామానికే తెలియదు, అ దేమిటో!

ఇలా సంవత్సరంనర గడచింది.

రామం బి.ఏ.కి కూర్చున్నాడు. రిజల్ట్సు వచ్చినై; పాసయాడు. లక్ష్మికూడా ఇంటరు పాసయింది. శేషగిరి గ్రూప్ లో తప్పాడు. అతని తండ్రి అతనికి రైల్వేలో ఉద్యోగంకోసం ప్రయత్నం చేస్తున్నాడు.

రామం శేషగిరికోసమంటూ స్టేషనుమాష్టరుగారింటికి పోతూ వుండేవాడు. టీ పుచ్చుకొని, కాసేపు బాతాఖానీ కొట్టి రైలుపట్టాల వెంటే షికారుకు వెళ్తూ వుండేవాళ్ళు ముగ్గురూ. ఒక్కోనాడు శేషగిరి ఏదైనా పనిలో వుంటే, వీళ్ళిద్దరే వెళ్ళివస్తుండేవారు. ఇద్దరే వున్నప్పుడు రామం ఏదన్నా లోకాభిరామాయణం ఎత్తేవాడు. లక్ష్మి దాన్ని ఎలాగో ఒకలా తిప్పి కాపిటలిజానికో, ఫాసిజానికో ముడి వేసి, చర్చను నీరసం చేసిపారవేసేది. ఒకనాడు మాటల సందర్భంలో రామం, తండ్రి తన్ను పెళ్లిచేసుకోమనీ. వాళ్లిచ్చే కట్నంతో బి. ఎల్. చదవమనీ నిర్బంధిస్తున్నాడని లక్ష్మికి చెప్పాడు. ఆమె నవ్వి, 'ఇందులో నిర్బంధమేముంది? పెళ్లి చేసుకోక, బ్రహ్మచారిగా వుంటావా?' అంది. రామం ఏం చెప్పుతాడు? బ్రహ్మచారిగా ఉంటానంటే ఒక చిక్కు! 'పెళ్ళి చేసుకొంటాను; కాని, ఆ పిల్లను గాదు, నిన్ను' - అని చెప్పటానికి దమ్ములు లేవు; లక్ష్మి యింతవరకేమీ సందివ్వకపోయె! ఏం చేస్తాడు, ఆ వేళకి ప్రసంగం మార్చాడు.

మర్నాడు షికారుకు పోయినప్పుడు, రామం తాను రాసిన వ్యాసాల కటింగ్సు కొన్ని లక్ష్మికి యిచ్చాడు. లక్ష్మి హెడ్డింగ్సు చూసి, యిచ్చేసింది. ఆ వ్యాసాల హెడ్డింగులివి. 'రష్యాలో వివాహం ఒక సమస్య కాదు.' 'లైంగిక సూక్తికి పర్యాయపదమే వివాహం!' 'భారతదేశంలో ఆడదాని అధోగతి.' రామం భయపడుతూనే లక్ష్మిని అభిప్రాయమడిగాడు: లక్ష్మి తలవాచేటట్లు చివాట్లు పెట్టింది; నీకేం తెలుసని ఈ లైంగిక సమస్యలు తీసుకుంటావంది. భారతదేశంలో మగవాళ్ళకి ఉత్తమగతులు పట్టినాయి కాబట్టి, మాకు లేవని దుఃఖమా! అంది. మీరంతా కాన్విక్టువార్డరులు; మీవల్ల ఖైదీలకేం సౌఖ్యాలు లభిస్తాయంది!-వైవాహిక సమస్యలు చర్చచేయడానికి నీకేం అధికారం వుంది? నువ్వెవ్వరి ప్రతినిధివి?....ఇలా ఎన్నో ప్రశ్నలు వేసింది గుక్కతిరక్కుండా! రామం ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. గుడ్లు వప్పగించి, ఊరుకున్నాడు. తర్వాత లక్ష్మి సాత్వికంగా బోధించింది — నీకు అందని విషయాన్నిగురించి చర్చించవద్దని. రామం ఆ వేళకు శోకతెంచుకు బయటపడ్డాడు.

మర్నాడు రామం చెట్టుక్రింద జ్యోతిష్కుడికి నాలుగణాలు దర్శించుకున్నాడు. పిట్టచేత ఆకు లాగించాడు- త్వరలో శ్వశురగృహ నివాసయోగముందని వచ్చింది. రామం మరోసారి కాఫీ తాగి, ఇంటికి పోయి, గదితలుపు బిగించి, సాయంత్రందాకా తంటాలు పడి పదిపేజీల వుత్తరం రాశాడు :- అందులో మొదటి నాలుగుపేజీల్లో లక్ష్మి అనే అయస్కాంతంవల్ల తను ఎలా ఆకర్షింపబడిందీ రాశాడు. తర్వాత నాలుగు పేజీల్లో తన యోగ్యతలు - చివరి రెండు పేజీల్లో లక్ష్మి చేయూత లేందే ఈ భవసాగరం ఈదలేననీ తెల్పాడు.

రామం ఉత్తరం పోస్టుచేశాడు - లక్ష్మి జవాబుకూడా యిచ్చింది క్లుప్తంగా-మూడు మాటల్లో - రామం ఆమెని సరిగా అర్థం చేసుకోలేదట. వివాహ విషయంలో తన అభిప్రాయాలు రామానికి కడివరకూ తెలుసట. తన్ను వరించటానికి తగిన త్యాగం రామం చెయ్యలేదట !

చివరిమాటకు రామం గుండె ఆగిపోయింది. మళ్ళీ ఇంకోమాటు చదువుకోలేకపోయాడా వుత్తరం. ఆవాళంతా పిచ్చికుక్కలాగా తిరిగాడు. రాత్రి గదికి చేరి, లెటరుప్యాడ్ తీశాడు. ఏమేమో రాశాడు. కొట్టివేశాడు. చివరకు ఈ అల్టిమేటం తయారు చేశాడు :-

కామ్రేడ్ లక్ష్మి !

నీ వుత్తరం నా హృదయం మీద బాంబులాగా పని చేసింది ! నీ పాలసీ హిట్లరు పాలసీకన్నా దుర్మార్గంగా ఉంది. పద్దెనిమిది మాసాలనించీ నువ్వు నన్నూ, నా పట్టుదలనూ ఎరుగుదువు! ఈ రోజున నా త్యాగం పరీక్షించగోరుతావా ? ఐతే ఇదే పరీక్ష ! ఈ వుత్తరం అందిన యిరవైనాల్గు గంటల్లో నువు నన్ను ప్రాణంతో చూడలేవు ! యిదే నీకోసం నేను చేస్తున్న త్యాగం; ప్రతిజ్ఞ !

ఇట్లు,
నీ కామ్రేడ్ కాగోరు
'రామం'

తరిగ :- నువ్వు నీ అభిప్రాయం మార్చుకునేపక్షంలో నేను నా ప్రతిజ్ఞ ఉపసంహరించుకోడానికి వీలుంటుంది. లేకపోతే ఇదే తుది.

నీ కామ్రేడ్, 'రామం'

లక్ష్మి వుత్తరం చదువుకుని, ఆదుర్దా పడింది. రామం పట్టుదల ఆమెకు తెలుసు....స్టూడెంట్లు ఏమన్నా నవ్వతాల కంటే. వాళ్ళతో మాట్లాడకండా సిగదీసుకునేవాడు-సంవత్సరాల తరబడి; పలకరించినాకూడా ముఖం తిప్పుకునేవాడు. ఈ మధ్య ఇంట్లో అలిగి, నాలుగైదురోజులు అన్నం తినలేదని

కూడా అతను చెప్పినట్టు ఆమెకి జ్ఞాపకం! మరి కర్తవ్యమో! తన మూలాన హత్య జరగాల్సిందేనా!

ఎంత ఆలోచించినా, ఆమె ఒక నిశ్చయానికి రాలేకపోయింది. మధ్యాహ్నం ఈ సంగతి శేషగిరిదగ్గర చల్లగా బయటపెట్టింది. అతడు వివరాలన్నీ ఒక్కొక్కటే తెలుసుకున్నాడు. నువ్వేమీ అదుర్దాపడవద్దని చెల్లెలికి ధైర్యం చెప్పాడు. రామానికి నేను చెప్పుతానని వుత్తరం తీసుకున్నాడు.

శేషగిరి రామాన్ని కల్సుకోనేలేదు. ఆసాయంత్రమే రామం అరెస్టయ్యాడు.

ఇంతకూ రామ మెందుకు అరెస్టయిందీ బయట పడనేలేదు. పట్టుకుపోయిన పోలీసులకి సిగరెట్ లంచం పెట్టినా మాకు తెలియదన్నారు. అరెస్టుకి పూర్వాపరసందర్భాలు విచారించినా-అంటే అగ్నిరూపం, ధూమరూపంలో కూడా ఆచూకీ ఏమీ బయట పడలేదు. దావానలరూపందాకా లేచి వుండక తప్పదేమో!

మర్నాడు మేజస్ట్రేటుకోర్టుకి చాలా మంది చేరారు. రామం మిత్రులు కొందరు దండలు తెచ్చారు. ఎందుకో లక్ష్మిమాత్రం రాలేదు. కేసు తీర్పు అయినాక ఇక్కడినించే లక్ష్మి యింటికి పోయి ఆమె కామ్రేడ్ జైలులో పడ్డందుకు సానుభూతి చూపివద్దామనుకున్నారు కొందరు మిత్రులు. సాయంత్రం బహిరంగసభ ఏర్పాటు చేసి, అందులో ప్రభుత్వచర్యను-రామంలాంటి యువకుల్ని అకారణంగా జైళ్లల్లో కుక్కుతున్నందుకు-తీవ్రంగా ఖండించా లనుకున్నారు, కొందరు నోటితీట నాయకులు.

రామాన్ని తీసుకొచ్చి బోను ఎక్కించారు. ప్రజలూ, మిత్రులూ జయజయధ్వానాలు చేశారు. రామం మందహాసంతో ప్రత్యుత్తర మిచ్చాడు. అతని ముఖాన నమ్రతతో కూడిన అహంకారం - కొంత మంది జాతీయ నాయకులలో గోచరించేది - తొణికిసలాడుతూంది.

ప్రజ అంతా తహతహలాడిపోతున్నారు. నేరారోపణ వినటానికి - తాము ఊహించుకున్నది స్థిరపరచుకోటానికి. ఆ శుభముహూర్తమూ వచ్చింది. రామానికి చార్జిషీటు చదివి వినిపించారు!-ఒక్క రామమే కాదు, అక్కడున్న వాళ్ళు చాలామంది దిగ్భ్రమ చెందారు? ముఖాలు నల్లబడిపోయినై. ఒక్కొక్కరే అక్కడినించి జారుకున్నారు. వివరాలన్నీ బయటపడేదాకా కూడా చాలామంది ఉండలేదు! రామంమీద మోపబడింది హత్యానేరం కాదు; ఆత్మహత్యానేరం. దానికి ప్రమాణం లక్ష్మికి అతను రాసిన వుత్తరం. ఐతే - కోర్టులో మేజస్ట్రేటు లక్ష్మిపేరుమాత్రం బయట పెట్టలేదు.